విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక
అనంతపురం
శ్రీ సత్యసాయి
5
సోమవారం 10- 02 - 2025

# మధ్యప్రదేశ్ ధార్ గ్యాంగ్ అరెస్టు

## రూ. 90 లక్షల బంగారు, వజ్రాభరణాలు, నగదు స్వాధీనం...

- అనంతపురం శ్రీనగర్ శివారు కాలనీలో 18 రోజుల కిందట జరిగిన చోరీ కేసు ఛేదింపు...
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్
- 4 పోలీసు బృందాలను రంగంలోకి దించి మధ్యప్రదేశ్ మారుమూల గ్రామాలలో సైతం జల్లెడ పట్టిన వైనం...
- ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల పోలీసులకు ఈ గ్యాంగ్ మోస్ట్ వాంటెడ్ గా ఉన్నట్లు విచారణలో వెల్లడి
- ప్రస్తుతం అరెస్టయిన ముగ్గురిలో గ్యాంగ్ లీడర్ పై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలో 32 కేసులు





అనంతపురం, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

అనంతపురం శ్రీనగర్ కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్ లోని 3 విల్లాస్ లో జరిగిన చోరీ కేసులను అనంతపురం పోలీసులు ఛేదించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో మోస్ట్ వాంటెడ్ గా ఉన్న మధ్యప్రదేశ్ ధార్ గ్యాంగ్ ఈ చోరీలకు పాల్పడినట్లు అనంతపురం పోలీసులు తేల్చారు. ధార్ గ్యాంగ్ కు చెందిన ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు.

సుమారు రూ. 90 లక్షల విలువ చేసే 59 తులాల బంగారు వస్తువులు మరియు వజ్రాలు పొదిగిన ఆభరణాలు మరియు రూ. 19,35,000/- నగదు, 3 ద్విచక్ర వాహనాలు, 2 సెల్ ఫోన్లు

- 22-01-25 న అనంతలో తాళం వేసిన ఇళ్లల్లో చోరీ ...

స్థానిక శ్రీనగర్ కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్ లోని శివారెడ్డి, రంజిత్ రెడ్డి, శివశంకర్ నాయుడు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. ఇళ్లకు తాళం వేయడంతో ఎవరూ లేనిసమయంలో చొరబడి సుమారు రూ. 2.13 కోట్లు విలువ చేసే బంగారు వస-్తువులు, వజ్రాభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు మేరకు స్థానిక 4 వ పట్టణ పోలీసులు కేసులు నమోదు చేసుకున్నారు

- సీరియస్ గా తీసుకున్న జిల్లా ఎస్పీ ... రంగంలోకి 4 ప్రత్యేక పోలీసు బృందాలు

ఈ చోరీలను జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ు సిరియస్ గా తీసుకున్నారు. చోరీలు జరిగిన ఇళ్లల్లో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ లను పంపి ఆధారాలు సేకరించారు. జిల్లా ఎస్పీ, అనంతపురం అర్బన్ డీఎస్పీలతో పాటు సిసిఎస్ పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను సందర్శించి జరిగిన తీరుపై ఆరా తీశారు. అంతేకాకుండా... ఈ చోరీ కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఛేదించేందుకు 4 పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. ఈ బృందాలు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ధార్ జిల్లా మారుమూల ప్రాంతాలకు వెళ్లి గాలించారు. దీంతోపాటు టెక్నాలజీని కూడా విరివిగా వినియోగించారు.

- అనంతలో చోరీలు మధ్యప్రదేశ్ ధార్ గ్యాంగ్ పనే...

ప్రస్తుతం అరెస్టయిన ముగ్గురిలో ఇద్దరైన నారు పచావర్, సావన్ మరియు పరారీలో ఉన్న మహబత్, మోట్ల లు మొత్తం నలుగురు కలసి గత నెల 16 వ తేదీన తమ స్వగ్రామం నుండీ దొంగతనాలు చేయాలనే ఉద్ధేశ్యంతో బయల్దేరి ఇండోర్ , ఇటార్చి వరకు బస్సులో... అక్కడీ నుండీ నేరుగా తమిళనాడులోని సేలంకు రైలులో చేరుకున్నారు. అటు నుండీ ధర్మపురికి వెళ్లి 2 బైకులను దొంగలించి బెంగుళూరు మీదుగా దొంగలించిన టూవీలర్లపై పెనుకొండ వైపు బయల్దేరి వచ్చారు. పెనుకొండ సమీపంలో వీరు వస్తున్న బైకులలో ఒక దానికి రిపేరు రావడంతో అక్కడే వదిలేశారు. సమీపంలో ఉన్న ఒక బైకు ను పెనుకొండ సమీపంలో దొంగలించి టూవీలర్స్ పై 21-01-25 తేదీ ఉదయం అనంతపురం చేరుకున్నారు.

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్ ... పగలు రెక్కీ... రాత్రి చోరీ

అనంతపురంలోని శ్రీనగర్ కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్ లో తాళం వేసిన ఇళ్లపై రెక్కీ చేశారు. ఆ విల్లాస్ లో ఉన్న శివారెడ్డి, రంజిత్ రెడ్డి, శివశంకర్ నాయుడు ఇళ్లను టార్గెట్ చేసుకున్నారు. నారు పచావర్, సావన్ ,మహబత్, మోట్ల లు 22-01-25 తేదీ తెల్లవారుజామున ఆ మూడిళ్లకు తాళాలు పగులగొట్టి ఆ ఇంట్లో చొరబడ్డారు. ఆ ఇళ్లల్లో ఉన్న విలువైన బంగారు, వజ్రాభరణాలు, నగదు ఊడ్చుకెళ్లారు.

చోరీలు తర్వాత హైదరాబాద్ కు చోరీ బైకులలో వెళ్లి... దొంగ సొత్తు వాటాలుగా పంచుకుని అనంతలో చోరీలు చేశాక ధర్మపురి, పెనుకొండలలో దొంగలించిన 2 టూవీలర్లలో నలుగురు గ్యాంగ్ అనంతపురం నుండీ హైదరాబాదు వెళ్లారు. ఎత్తుకెళ్లిన సొమ్ము, నగదును అక్కడ వాటాలుగా పంచుకున్నారు. నారు పచావర్, సావన్ లో హైదరాబాద్ లో ఉంటూ దొంగ సొత్తును విక్రయించే ప్రయత్నం చేయగా కుదర్లేదు... అక్కడ అమ్మడం అసాధ్యమని భావించి దొంగలించిన సొమ్ములను బెంగుళూరులో అమ్మే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. సాధ్యపడలేదు. కడకు ... మధ్యప్రదేశ్ కు చెందిన రిసీవర్ రమేష్ ను ఫోన్లో సంప్రదించి చోరీ సొమ్మును కొనాలని కోరారు. రమేష్ దొంగ సొత్తులను కొనడంలో దిట్ట కావడంతో తనకు కుదరక తన కొడుకైన సునీల్ ను పంపాడు. ఈ ముగ్గురు స్థానిక రాయల్ నగర్ లో బేరం చేసుకుంటుండగా జిల్లా ఎస్పీ గారికి సమాచారం అందింది. అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సి.ఐ

6లో

## హంద్రీనీవా కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులు ఆపాలి - పరివాహక ప్రాంత రైతులు

- కాలువ లైనింగ్ పనుల ద్వారా భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం
- రాప్తాడులో హెచ్ ఎన్ ఎస్ ఎస్ లైనింగ్ పనులతో బీడుగా మారనన్న 3 లక్షల ఎకరాలు
- హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి పిల్ల కాలువ ద్వారా నీరు ను అందించండి
- అనంత రైతులారా మేల్కోనండి తెదేపా చేస్తున్న మోసం గమనించండి



ఆత్మకూరు, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

రాప్తాడు నియోజకవర్గంలోని హంద్రీనీవా కాలువ లైనింగ్ కాంక్రీట్ పనులు ద్వారా ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలలో దాదాపు 80% శాతం మంది రైతులు హంద్రీనీవా పై ఆధారపడి పంటలు వేసుకుని జీవిస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం తీసుకున్నటువంటి అనాలోచిత నిర్ణయాల వల్ల హంద్రీనీవా లైనింగ్ పనుల ద్వారా భూగర్భ జలాలు అడుగంటి దాదాపు 3 లక్షల ఎకరాలు బీడుగా మారే ప్రమాదం పొంచి ఉంది. దాదాపు 250 కిలోమీటర్ల మేర లైనింగ్ పనుల ద్వారా రైతులు పంటలకు నీరు అందక నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. ఎమ్మెల్యే పరిటాల సునీత మరియు తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు కలసి హంద్రీనీవా కాలువ కాంక్రీట్ లైనింగ్ (ప్లాస్టరింగ్) చేసి నీళ్ళను కుప్పానికి తరలించకపోయేందుకు యోచిస్తున్నట్టు సమాచారం,100 కోట్ల రూపాయల కమీషన్ల కోసం 1000 కోట్లతో హంద్రీనీవ 2వ దశ జీడిపల్లి నుండి ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, కొత్త చెరువు బుక్కపట్నం, ముదిగుబ్బ, తలపుల, కదిరి రూరల్, నల్లమాడ మండలాలల్లో దాదాపు 250 కిలోమీటర్లు మేర హంద్రీనీవ కాలువ మరియు పుంగనూరు బ్రాంచ్ కాలువలో కాంక్రీటు లైనింగ్ (ప్లాస్టరింగ్) పనులు చేస్తే"కాలువ క్రింది దాదాపు 20 కిలోమీటర్ల వరకు పెరిగిన భూగర్భ జలాలు అడుగంటిపోతాయి. కాలువ లైనింగ్ లేకుండా ఉండడం వల్ల ఇప్పటి వరకు నీరు భూమిలోకి ఇంకిపోయి గత 10 సం ||రాలుగా దాదాపు 200 టి. యంసి.ల నీరు భూమిలోనికి చేరాయి. అందువల్లే భూగర్భ జలాలు పెరిగి మనం బోర్ల ద్వారా సాగుచేసుకోగలినాము. ఇప్పుడు ఎం.ఎల్.ఏ. కాసుల కక్కుర్తి కోసం లైనింగ్ పనులు జరిగితే నియోజకవర్గంలోని కాలువ దిగువున ఉన్న దాదాపుగా 3లక్షల ఎకరాలు రైతుల భూములు బీడులుగా మారబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం ,నాడు వైయస్సార్ ఆశయం హంద్రీనీవ ద్వారా 6 లక్షల ఎకరాలకు పిల్ల కాలువల ద్వారా సాగునీరు అందజేయడమే లక్ష్యంగా నాడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాలువను వెడల్పు చేసి పిల్లకాలువలు ద్వారా మన జిల్లాలో 3లక్షల ఎకరాలకి సాగునీరు ఇవ్వడానికి అనుమతులను ఇచ్చారు. రోజుకు 0.5 టి.యం.సి. నీళ్లు తెచ్చి (రోజుకు 8 వేల ఎకరాలకు సాగునీరు)మన జిల్లాలో 3లక్షల ఏకరాలకు నీల్లు ఇవ్వడానికి సిద్ధం చేసింది. పిల్లకాలువ ద్వారా కాని చంద్రబాబు ప్రభుత్వం పిల్లకాలువలను

6లో

## జిల్లా ఎస్పీ చేతుల మీదుగా జేబీఎన్ న్యూస్, అనంతప్రభ దినపత్రిక నూతన క్యాలెండరు ఆవిష్కరణ




అనంతపురం, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ , అర్బన్ డిఎస్పి శ్రీనివాసరావు మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్లు చేతుల మీదుగా జేబీఎన్ న్యూస్, అనంతప్రభ తెలుగు దినపత్రికను 2025 నూతన సంవత్సరం క్యాలెండర్ ను ఆదివారం రోజున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాలను నిర్భ-యంగా, ఉన్నది ఉన్నట్టుగా వాస్తవాలను వెలికి తీసి సమాజానికి డైలీ కథనాల రూపంలో అందిస్తున్న జేబీఎన్ న్యూస్ మరియు అనంత ప్రభ (న్యూస్) తెలుగు దినపత్రిక అనంత జిల్లా స్టాపర్ త్యాగరాజు పులి మరిన్ని దినపత్రిక కథనాలతో నిరంతరం ప్రజలకు సమాజానికి పాఠకులకు ఒక మంచి సందేశాన్ని అందించాలని వారు ఆకాంక్షించారు.

## గీత పనివాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి




శింగనమల, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

అనంతపురం రూరల్ గీత పనివాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ కార్యాలయంలో ఆదివారం గీత పనివాళ్ల సంఘం సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వక అధ్యక్షులు సి లింగమయ్య చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సి.వి. హరి కృష్ణ హాజరై మాట్లాడుతూ.... గీత పనివాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. గీత పనివార్లకు కనీస అవసరాలు గాని కల్పించలేకపోతోంది అన్నారు. గీత పనివార్లకు టిఎఫ్టి లైసెన్సులు ఇవ్వాలని ఈతవనాలకు భూమి కేటాయించాలని కోరారు. టిసిఎస్ లో మెంబర్గా కార్మికులను చేర్చుకోవాలని గీత పనివార్లకు గుర్తింపు కార్డులు కూడా ఎక్సైజ్ వారు వెంటనే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళన సిద్ధమవుతామని గీత పనివాళ్ళు హెచ్చరించారు. జిల్లా కమిటీని ఎన్నిక చేయడానికి ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు సమక్షంలో జిల్లా కమిటీ లో గౌరవాధ్యక్షులుగా కొండప్ప, అధ్యక్షులు సంగమేశ్వర, జిల్లా ఉపాధ్యక్షులు ఈడిగ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఈ. రఘు, సహాయ కార్యదర్శి సూరి, ఉపాధ్యక్షులు శంకరయ్య ఆర్గనైజరు సెక్రెటరీ ఈ సంగప్ప కమిటీ నెంబర్స్ రామకృష్ణ నాగభూషణ, తదితరులు ఎన్నికయ్యారు

## దళిత గిరిజనుల వ్యతిరేకి జిల్లా విద్య శాఖ అధికారి ప్రసాద్ బాబు ఖబర్దార్ గిరిజన ప్రజా సమాఖ్య మరియు దళిత సంఘాలు



అనంతపురం, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

అనంతపురం గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జీవి మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ

జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు గారు జిల్లాకు వచ్చిన రెండు నెలల కాలంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలను పక్కనపెట్టి తాను పనిచేయాలంటే కేవలం అగ్ర కులాలు అయి ఉండాలి అగ్రకుల పక్షపాతి పనిచేస్తూ బడుగు బలహీన వర్గాలకు పనిచేయను అని పాలన సాగిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు ను గిరిజన ప్రజా సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తీవ్రంగా ఖండించాడు బడుగు బలహీన వర్గాలకు గిరిజనులకు ఇదే విధంగా అన్యాయం కొనసాగితే ప్రజాస్వామ్య పద్ధతుల్లో బుద్ధి చెబుతామని ఖబర్దార్ అని హెచ్చరించడం జరిగింది

ప్రజాబలం వ్యవస్థాపక అధ్యక్షుడు చందు నాయక్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు పనిచేయాలంటే వారు కేవలం అగ్రవర్ణాలు అయి ఉండాలి ఈ ధోరణి చూపిస్తూ ఇటీవల నియామకాలన్నీ నిబంధనలకు చట్టానికి విరుద్ధంగా కేవలం ఓసి వర్గాలనే నియమించి బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం చేయడడం ఎంతవరకు సమంజసం తీవ్రంగా ఖండిస్తున్నాం రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర యువజన అధ్యక్షుడు జీవి ఉజ్వల్ మాట్లాడుతూ రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం చేస్తున్నావని జిల్లా విద్యాశాఖ అధికారిని అడుగుతే వారి ప్రభుత్వం ఉంది వారికే నియామకాలు చేపట్టడం న్యాయం అని అనడం ఇది నియంత ధోరణికి పరాకాష్ట కావున జిల్లా విద్యాశాఖ అధికారి ఇదే ధోరణి కొనసాగితే ప్రజాస్వామ్య పద్ధతుల్లో బుద్ధి చెబుతామని

## ప్రతి ఒక్క కార్యకర్త కి అండగా ఉంటా : చెన్నకేశవరెడ్డి..



పామిడి, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

పామిడి పట్టణం చిన్న రంగనాయకులు మనవడు మరియు బొయ శ్రీనివాసులు కుమారుడు వెంకటేష్ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి గాయాల పాలవడం జరిగింది. విషయం తీసులుసుకున్న గుంతకల్లు నియోజకవర్గం యువ నాయకులు మంజునాథ్ రెడ్డి మరియు అనంతపురం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ, గుత్తి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెమ్మక చెన్న కేశవ రెడ్డి పరామర్శించి ఆ కుటుంబానికి10,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. ప్రతి ఒక్క కార్యకర్త కి అండగా ఉంటామని భరోసానివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు మంజునాథ్ రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెమ్మక చెన్నకేశవరెడ్డి, మండల కన్వీనర్ నగూరు ఈశ్వర్ రెడ్డి, రామచంద్ర, చుక్కల సూరి, మాజీ కౌన్సిలర్ సుధాకర, సుంకన్న పాల్గొనడం జరిగింది..

# మధ్యప్రదేశ్ ధార్ గ్యాంగ్ అరెస్టు

ఐదవ పేజి తరువాయి

లు కనుమూరి సాయినాథ్, హేమంత్ కుమార్, జయపాల్ రెడ్డి, ఎస్సైలు రాంప్రసాద్, రాజశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది బృందంగా ఏర్పడి ఆదివారం స్థానిక రాయల్ నగర్ సమీపంలో అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా... అనంతపురం చోరీల్లో పాల్గొన్న మహబత్, మోట్లలు హైదరాబాద్ లో నారు పచావర్, సావన్ లు తో దొంగసొత్తులను వాటాలుగా పంచుకున్న తర్వాత వారి స్వగ్రామానికి వెళ్లారు. రిసీవర్ సునిల్ తండ్రి అయిన రమేష్ కూడా పరారీలో ఉన్నట్లు విచారణలో తేలింది.

● అందరూ పాత నేరస్తులు... పదుల సంఖ్యల్లో కేసులు

ప్రస్తుతం అరెస్టయిన ముగ్గురు పరారీలో ఉన్న ఇద్దరు కూడా పాత నేరస్తులే. ఈ ఐదుగురిలో నారు పచావర్, మహబత్ లు ముఖ్యులు. స్వయాన ఇద్దరూ అన్నదమ్ములు. వీరికి మిగితా ముగ్గురు సోదరులుంటే వారు కూడా నేరస్తులే. ప్రస్తుతం వారు కూడా హైదరాబాద్ లోని జైలులో ఉంటున్నారు. నారు పచావర్ పై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో సుమారు 32 కేసులు ఉన్నట్లు సమాచారం ఉంది. మహబత్ పై కూడా నాలుగు రాష్ట్రాలలో సుమారు 29 కి పైగా కేసులున్నాయి. సావన్, సునీల్, మోట్లలపై కూడా కేసులు ఉన్నాయి. సునీల్ పై 9 కేసులు... ఈయన తండ్రి రమేష్ పై కూడా ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలలో సుమారు 34 కేసులు ఉన్నట్లు వెల్లడైంది. వీరు అంతర్రాష్ట్ర దొంగలు. పరారీలో ఉన్న గ్యాంగ్ సభ్యుల కోసం గాలింపు ప్రక్రియ కొనసాగుతోంది.


● 4 రాష్ట్రాలలో ధార్ గ్యాంగ్ మోస్ట్ వాంటెడ్

ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో ధార్ గ్యాంగ్ మోస్ట్ వాంటెడ్ గా ఉంటోంది. ప్రస్తుతం పట్టుబడిన ముగ్గురు మరియు పరారీలో ఉన్న ఇద్దరితో పాటు సుమారు 60 మంది దాకా ఈ గ్యాంగ్ లో సభ్యులు ఉంటారు. అయితే ఐదారుగురు కలిసి గ్యాంగ్ గా ఏర్పడి చోరీలు చేస్తారు. వీరంతా కూడా మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా టాండ పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాలకు చెందిన వారే. వ్యవసాయ కూలీల వృత్తిని జీవనం కోసం ఎంచుకుని ప్రవృత్తి మాత్రం దొంగతనాలు చేయడం వీరికి రివాజుగా మారింది. ప్రధానంగా తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేయడం... పగలు రెక్కీ రాత్రివేళల్లో చోరీలు చేయడం ఈ గ్యాంగ్ కు పరిపాటి. చిన్న వయస్సుల్లోనే పెళ్లిళ్లు చేసుకోవడం, చెడు వ్యసనాలకు అలవాటు పడటం వెరసి డబ్బు సులువుగా సంపాదించాలని చోరీలు ఎంచుకున్నట్లు విచారణలో వెల్లడయ్యింది.

● కొసమెరుపు : 4 రాష్ట్రాలలో తాళం వేసిన ఇళ్లల్లో దొంగలించిన సొత్తులను రిసీవర్ రమేష్ కు విక్రయించడం సదరు గ్యాంగ్ సభ్యులు అలవాటుగా చేసుకున్నారు. సాధారణంగా బంగారు వస్తువులు క్రయ, విక్రయాల సందర్భంగా తూకం వేయడం కీలక ప్రక్రియ. ఆసమయంలో గ్రాములే కాకుండా క్యారెట్ వారీగా పరిగణలోకి తీసుకుని లెక్కగట్టి చెల్లింపులు చేస్తారు. ఇక్కడ మాత్రం విచిత్రం. దొంగ సొత్తును కొనుగోలు చేసే సమయంలో ఎలాంటి తూకం లేకుండా అందాజుగా లెక్కకట్టి తోచినంత మొత్తం చెల్లించడం... అదే డబ్బును తలాడించి తీసుకోవడం జరుగుతుండటం కొసమెరుపు. కష్టపడి కొనిన సొమ్ములకయితే లెక్కలు ఉంటాయి ఆయాచితంగా వచ్చిన సొమ్ములను ఎంతకో ఒకంతకు అమ్మి ఆ డబ్బుతో ఎంజాయ్ చేయడమే ధార్ గ్యాంగ్ సభ్యులు ధ్యేయంగా పెట్టుకున్నారు.

● శ్రమించిన ప్రత్యేక పోలీసు బృందాలకు ఎస్పీ ప్రశంస : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్ గా ఉంటూ పలు చోరీలకు పాల్పడిన ధార్ గ్యాంగ్ ను అరెస్టు చేసిన అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సి.ఐ లు కనుమూరి సాయినాథ్, హేమంత్ కుమార్, జయపాల్ రెడ్డి, ఎస్సైలు రాంప్రసాద్, రాజశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ అభినందించారు.

# పెద్ద మట్లగొంది. చిన్న మట్లగొంది గ్రామలలోని తోటలలో విద్యుత్ కేబులు అపహరణ



శింగనమల, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

మండల పరిధిలోని పెద్దమట్లగొంది. చిన్న మట్లగొంది గ్రామాలలోని తోటలలో రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పలువురి రైతుల విద్యుత్ కేబుల్ వైర్లు. అపహరించారు. దాదాపు రెండు నెలల క్రితం ఒకసారి. మళ్లీ నెలరోజుల క్రితం ఇదే గ్రామంలో విద్యుత్ కేబుల్ వైర్లు చోరీ చేశారు. వరుసగా మూడోసారి శనివారం దొంగలు చోరీకి పాల్పడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెరిగిన పంట పెట్టుబడులు. గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న తమను ఈ వరుస కేబుల్ వైర్ల చోరీతో మరింత నష్టపరుస్తున్నారని. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి దొంగలను పట్టుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వెంగమ నాయుడు కాలనీ లో చోరీ..



పామిడి, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

పామిడి పట్టణం వెంగమనాయుడు కాలనీ కి చెందినటువంటి ఫోటో స్టూడియో నిర్వాహకుడు శ్రీనివాస్ రెడ్డి ఇంటిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. పామిడి పట్టణం నందు ఫోటో స్టూడియో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్న శ్రీనివాసరెడ్డి శనివారం రోజున కుటుంబ సభ్యులతో కలిసి కసాపురం ఆంజనేయ స్వామి దర్శనానికి వెళ్లడం జరిగింది. ఇదే అదునుగా చూసుకున్న దొంగలు ఇంటి తాళాలను పగల కొట్టి బీరువాలో దాచి ఉంచిన 20 తులాల బంగారం ఎత్తుకెళ్లారని శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# వాల్మీకి జాతర లో పాల్గొన్న పామిడి వీరా..



పామిడి, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

పామిడి పట్టణానికి చెందినటువంటి అనంతపురం జిల్లా మాజీ ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ పామిడి వీరాంజనేయులు కర్ణాటక రాష్ట్రంలో జరుగుతున్నటువంటి వాల్మీకి జాతరలో పాల్గొనడం జరిగింది. కర్ణాటక రాష్ట్రం దావనగెరి జిల్లా హరిహర మండలం రాజానహల్లి గ్రామంలో జగద్గురువులు శ్రీ వాల్మీకి ప్రసన్ననంద మహా స్వామీజీ 17 వసవత్సరాల పట్టాభిషేకం మహోత్సవ కార్యక్రమంలో ఏ డి సి సి బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరా తో పాటు వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, పెనగొండ ఈశ్వయ్య తదితరులు పాల్గొనడం జరిగింది..

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ



ఆత్మకూరు, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండలం స్థానిక మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో ప్రసిద్ధి నచ్చిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మాఘమాసం రెండవ ఆదివారం సంధర్భంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఉదయం నుండి అర్చనలు, పాలాభిషేకం పంచామృత అభిషేకం, బంగారు కవచసేవ అలంకరణ, పల్లకి సేవ ఆకుపూజ ,అర్చన మహానైవేద్యం , మహామంగళహారతి , మరియు కుజదోష కాలసర్పదోష సర్పదోష నివారణ కొరకు "శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల మంత్ర బీజాక్షర హోమము" మరియు లోక కళ్యాణార్థం సర్వ కార్య సిద్ధికి " మహా గణపతి హోమం " నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి బి. బాబు తెలియజేశారు. మాఘ మాసం సందర్భంగా భక్తులు అధికంగా స్వామివారి అభిషేకం మరియు హోమము నందు పాల్గొన్నారు.




# హంద్రీనీవా కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులు ఆపాలి - పరివాహక ప్రాంత రైతులు

ఐదవ పేజి తరువాయి

రద్దుపరిచి కాలువను వెడల్పుచేయకుండా, లైనింగ్ చేసి (6 రోజులకు 1 టి.యంసి.) ఇవ్వవలనని చూస్తుంది. (జగన్ మోహన్ రెడ్డి రోజుకు 8వేల ఎకరాలకు నీల్లు ఇవ్వవలనని చూస్తే, చంద్రబాబు ప్రభుత్వం రోజుకు 1000 ఎకరాలకు మాత్రమే నీల్లు ఇవ్వవలనని నిర్ణయం తీసుకొన్నారు) కాని చంద్రబాబు ప్రభుత్వం కుప్పంకు నీరు తరలించి అనంతపురము జిల్లాను ఎండబెట్టి తనకు అనంతపురము జిల్లాపై ఉన్న సవతి ప్రేమను చాటుకుంటున్నట్లు రైతులు ఒకరికొకరు బహిరంగంగా చర్చించుకుంటున్నట్లు సమాచారం, వైయస్ జగన్ కుప్పంకు నీరు ఇవ్వడానికి ఏర్పాటుచేసిన ప్రత్యాన్మయ మార్గం హంద్రీనీవ చివరి జిల్లాలైన చిత్తూరు, కపడ జిల్లా ప్రాంతాలకు నీరు ఇవ్వడానికి హంద్రీనీవ నుండి సాధ్యపడదని కర్నూలు అనంతపురము జిల్లాలకే ఈ హంద్రీనీవ నీటిని పరిమితం చేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గండికోట రిజర్వాయర్ను నుండి గాలేరు నగరి కాలువ నుండి పుంగనూరు బ్రాంచి కాలువకు హంద్రీనీవ కాలువ కు ఒక లింకు కాలువ ఏర్పాటుచేసి 20 టి. యం.సి.ల నీరును చిత్తూరు జిల్లాకు ఇవ్వదలచినారు. దీని కోసం 3 వేల కోట్లు ప్రాజెక్టును ప్రారంభించారు. ఇప్పటికి దాదాపుగా 1500 కోట్లతో పనులు జరిగినాయి. మరొక 1500 కోట్ల రూపాయిలు పనిచేస్తే చిత్తూరు జిల్లాకు నీరువెళుతాయి దీని వలన గండికోట రిజర్వాయర్ నుండి సముద్రంలోకి వెళుతున్ననీరు సద్వినియోగం చేసుకొని చిత్తూరు జిల్లాకు మల్లించవచ్చు.ఆ విధంగా హంద్రీనీవ చివరన ఉన్న చిత్తూరు జిల్లాకు వేరొక కాలువ నిర్మాణంచేసి 20 టి.యం.సి ఇస్తే ఆ 20 టి.యం.సిల నీరు హంద్రీనీవ నుండి చిత్తూరు జిల్లాకు ఇవ్వవలసిన అవసరం ఉండదు కనుక, అనంతపురము జిల్లాలో ప్రధాన కాలువ క్రింద ఉపకాలువలు, పిల్లకాలువలు నిర్మించి 3లక్షల ఎకరాల భూములకు నీరు ఇచ్చి జిల్లాను సస్యశ్యామలం చేయాలని వైయస్ జగన్ భావించారు. జీడిపల్లి నుండి 500 కిలోమీటర్లు తరువాత ఉన్న కుప్పంకు నీల్లు చేరాలంటే భూగర్భంలో నీరు ఇంకకుండా చేస్తేనే సాధ్యమని టి.డి.పి. ప్రభుత్వం కాలవలో కాంక్రీట్ ప్లాస్టరింగ్ లైనింగ్ చేయిచున్నారు. కావున మనం రాబోయే విపత్తును దృష్టిలో పెట్టుకొని మన గ్రామలలో సాగుభూములు బీడుభూములుగా మారకుండ ఉండాలంటే ప్రభుత్వం కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులను అపేంతవరకు పరివాహక ప్రాంత రైతులను ఏకమై రైతులకు జరగబోయే నష్టాన్ని గుర్తించి పెద్ద ఎత్తున రైతులు మనం పోరాటం చేయడానికి సిద్ధమయ్యారు.

# హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



అనంతపురం, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

గత నెలలో అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ లోని ఓ ప్రయివేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందిన స్థానిక టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ నారాయణ నాయక్ ఈరోజు పుట్టపర్తి మండలం పెదవల్లి గ్రామంలో ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పుట్టపర్తి మండలం పెదబల్లి గ్రామానికి చెందిన ఇతను1990 లో జిల్లా పోలీస్ ఏ.ఆర్ విభాగంలో కానిస్టేబుల్ గా చేరాడు. ఆతర్వాత సివిల్ విభాగానికి కన్వర్షన్ అయ్యా వివిధ ప్రాంతాలలో విధులు నిర్వహించారు. పదోన్నతితో హెడ్ కానిస్టేబుల్ గా అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్లో గత ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. గత నెల విధుల్లో ఉన్న నారాయణ నాయక్ అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని సోములదొడ్డి సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గాయపడిన ఇతనిని అనంతపురం ఆతర్వాత మెరుగైన చికిత్స కోసం బెంగుళూరు, హైదరాబాద్ లకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం హైదరాబాద్ లోని ఓ హాస్పిటల్ లో చనిపోయాడు. మృతదేహాన్ని మృతుడి స్వగ్రామమైన పెదబల్లికి తరలించారు. ఈరోజు ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ క్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య శాంతాబాయి , కుమారుడు, కూతురు ఉన్నారు. స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో అనంతపురం టూ టౌన్ సిఐ శ్రీకాంత్ ,పుట్టపర్తి రూరల్ ఎస్సై లింగన్న, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , గాండ్ల హరినాథ్ , రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్య కుమార్, లక్ష్మీనారాయణ , సిబ్బంది బ్యాచిమేట్లు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.


# మఠం హేమంత్, వందన వివాహ రిసెప్షన్ కు హాజరైన ఎన్డీఏ కూటమీ నాయకులు



కూడేరు, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

కూడేరు మండలం స్థానిక మండల కేంద్రంలోని శ్రీ సంగమేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పెండెంట్ ఎం లోకనాథ్, అనసూయమ్మ వీరి ఏకైక పుత్రుడు పెండ్లి కుమారుడు హేమంత్, వందన వివాహ రిసెప్షన్ వారి స్వగృహం నందు అంగరంగ వైభవముగా జరిగినది, నూతన వధూవరులను ఆశీర్వదించడానికి, రవి కృప గ్రూప్ సంస్థ ఎండి వన్నూరప్ప, యాజమాని మేనేజ్మెంట్, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులుటీడీపీ మండల కన్వీనర్ చోళ సముద్రం మురళి, బాటా వెంకటేష్, జయప్రకాష్ గౌడ్, అరవకూరు మాజీ సర్పంచ్ ప్రసాద్,పుట్టానరేష్ బిజెపి నాయకులు రామ్ భీమ్, బిజెపి మండల అధ్యక్షుడు ఇప్పేరు నాగరాజు, కిసాన్ మూర్చా మండల అధ్యక్షుడు మలోబులు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, దళిత మోర్చా నాయకులు ఓబులేసు, మెకానిక్ రాము, తదితరులు పాల్గొన్నారు.

# మార్కుల నమోదు కేంద్రంలోకి ఎగ్జామినర్లకే అనుమతి



అనంతపురం, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల ఆన్‌లైన్ మార్కుల నమోదు సమయంలో కేంద్రంలో ఎగ్జామినర్లకే అనుమతి ఉంటుందని, ఇతరులెవరూ ఉండకూడదని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణనాయక్ సూచించారు. ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు రెండోవిడత, జనరల్ విద్యార్థులకు తొలివిడత ప్రాక్టికల్స్ ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో శనివారం స్థానిక కొత్తూరు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లకు ఒకరోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణనాయక్ మాట్లాడుతూ రోజూ రెండు పూటలా ప్రాక్టికల్స్ జరగనున్నాయన్నారు. ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటలలోపు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటి గంటలోపు ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లకు వచ్చే ఓటీపీ సాయంతో పాస్‌వర్డ్ నమోదు చేసి ప్రశ్నపత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సంతకాలు తీసుకుని వాటిని ఎగ్జామినర్లకు అందజేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీఎస్‌లు, ఎగ్జామినర్లు, నాన్‌టీచింగ్ ఉద్యోగులు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ప్రాక్టికల్స్ నిర్వహించాలన్నారు. గాలి, వెలుతురు ఉండేలా చూడాలన్నారు. ప్రతి సెంటర్‌లోనూ ఎగ్జామినర్లు మూడురోజులు, చీఫ్ సూపరింటెండెంట్లు ఐదు రోజులు ఉంటారన్నారు. తర్వాత మరో కేంద్రానికి నియమిస్తారన్నారు. కేంద్రాల్లో ఏ చిన్నపొరబాటు జరిగినా సంబంధిత సీఎస్‌లు, ఎగ్జామినర్లదే బాధ్యత అని హెచ్చరించారు. సమావేశంలో డీఈసీ సభ్యులు పాల్గొన్నారు.

# గుంటి కింద సుబ్బరాయుడు స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



శింగనమల, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

గార్లదిన్నె మండలం, కోటంక గ్రామంలో గుంటి కింద సుబ్బరాయుడు స్వామి వారి బ్రహ్మోత్సవాలుకు మాఘమాసం రెండోవారమున నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజల అందరి పై స్వామి వారి కృప, ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.

# జేబీఎన్ న్యూస్, అనంత ప్రభ క్యాలెండర్ ను ఆవిష్కరించిన జనసేన పార్టీ మండలం అధ్యక్షు లు తోట ఓబులేసు



శింగనమల, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

అనంతపురం నగరం జనసేన పార్టీ సింగనమల మండల అధ్యక్షులు తోట ఓబులేసు నివాసంలో అనంతప్రభ జేబీఎన్ న్యూస్ క్యాలెండర్ను తోట ఓబులేసు మరియు సతీమణి తోట నాగశేషమ్మ.చేతుల మీదుగా క్యాలెండర్ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శ్రీ మద్దిలేటి రెడ్డి యువ నాయకులు శ్రీ రామ్మోహన్ శ్రీమతి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# కీర్తికి అండగా ఉంటాం



అనంతపురం, ఫిబ్రవరి 9 (అనంత ప్రభ)

తల్లిదండ్రులకు దూరమై అష్టకష్టాలు పడుతున్న చిన్నారి కీర్తికి ప్రభుత్వం తరుపున అన్నిరకాలుగా అండగా ఉంటామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వనజాఅక్కమ్మ తెలిపారు. శనివారం సాక్షిలో 'కీర్తి కథ ..కన్నీటి వ్యథ' శీర్షికన వెలువడిన కథనానికి ఆమె స్పందించారు. నగరంలో పాతూరు మున్నానగర్‌లో కీర్తి నివాసముంటున్న ఇంటికి ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ, అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ లలిత, ఐసీపీఎస్, శిశుగృహ, చైల్డ్‌లైన్ సిబ్బంది వెళ్లారు. పాప నాన్నమ్మ వెంకటలక్ష్మితో మాట్లాడారు. కుటుంబకలహాలతో ఎవరికి వారు దూరం కావడంతో చిన్నారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడినట్లు గుర్తించారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఎన్ఆర్‌సీలో పాపకు చికిత్సతో పాటు కొద్దిరోజులు పౌష్టికాహారం అందించాల్సి ఉందని తెలిపారు. భవిష్యత్‌లో చిన్నారికి ఆశ్రయం, విద్యను అందించేందుకు సహాయం చేస్తామని వెల్లడించారు. అయితే కొన్ని విషయాలకు తల్లిదండ్రులు సముఖత వ్యక్తం చేయకపోవడంతో సోమవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఎదుట హాజరుపరిచి వారి ఆదేశాలతో చిన్నారి సంరక్షణకు చర్యటు తీసుకుంటామని పీడీ వనజాఅక్కమ్మ వివరించారు. చిన్నారి తల్లివద్ద పెరగకపోవడంతో పౌష్టికాహారం లోపంతో ఇబ్బందులు పడే అవకాశముందని వెల్లడించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు.

AP 4PG 10 02 2025 MONDAYqxp_Layout 1 09-02-2025 09:24 PM Page 3











## కరివేపాకుని ఇలా తింటే షుగర్ ఉన్నవారికి మంచిదట..



కరివేపాకు ఆరోగ్యానికి నిజంగా చాలా మంచిది. అంతేకాకుండా, దీనిని వాడడం వల్ల జుట్టు సమస్యలు కూడా దూరమవుతాయని చెబుతున్నారు నిపుణులు. దీనిని అనేక రకాలుగా తీసుకుంటాం. కరివేపాకు పచ్చడి, వంటల్లో వాడడం, కరివేపాకు రైస్ ఇలా ఎన్నో రకాలుగా వాడతాం. దీంతో ఆరోగ్యంతో పాటు జుట్టుకి హెల్ప్ చేస్తుంది. అయితే, జుట్టు రాలడాన్ని దూరం చేసేందుకు కరివేపాకుని ఎలా వాడాలో ఇప్పుడు చూద్దాం.

జుట్టు ఆరోగ్యానికి..

కరివేపాకు జుట్టు రాలడాన్ని తగ్గించడమే కాకుండా నెరసిపోవడాన్ని కూడా దూరం చేసి జుట్టు పెరిగేలా చేస్తుంది. ఇక మైగ్రేన్ వంటి తలనొప్పులని కూడా దూరం చేస్తుంది. దీంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను దూరం చేసి బరువు తగ్గడానికి హెల్ప్ చేస్తుంది. హార్మన్ల సమస్యల్ని దూరం చేస్తుంది.

జుట్టుకి కరివేపాకు..

కరివేపాకు హెయిర్ మాస్క్, హెయిర్ ఆయిల్‌ని వాడడం వల్ల చుండ్రు, జుట్టు రాలడం, తెల్లబడడం వంటి సమస్యలన్నీ దూరమవుతాయి. దీంతో పాటు జుట్టు పెరిగేలా చేస్తుంది.

చుండ్రు దూరం..

కరివేపాకుని మిక్సీ పట్టి మజ్జిగలో కలిపి పేస్టలా చేయండి. దీనని తలకు పట్టించాలి. ఆరిపోయాక నీటితో కడగాలి. వారానికి రెండు, మూడు సార్లు ఇలా చేస్తే సమస్య దూరం..

నోటి దుర్వాసన..

చాలా మందికి అనేక కారణాలతో నోటి నుండి దుర్వాసన వస్తుంది. అలాంటి సమస్యకి కరివేపాకుతో చెక్ పెట్టొచ్చు. దీని కోసం 5 తాజా కరివేపాకులని తీసుకుని 5 నిమిషాల పాటు నమలాలి. తర్వాత మీ నోటిని నీటితో క్లీన్ చేసుకోండి. దీంతో నోటి దుర్వాసన దూరం.

బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్..

షుగర్ పేషెంట్స్‌కి కరివేపాకు బాగా హెల్ప్ చేస్తుంది. దీనిని చట్నీలా చేసుకుని తినడం, వారి డైట్‌లో యాడ్ చేసుకోవాలి. కరివేపాకులోని ఫ్లేవనాయిడ్స్ బాడీలోని కార్బోహైడ్రేట్స్ నుండి గ్లూకోజ్‌కి జీవక్రియను నిరోధిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర నిల్వల్ని నియంత్రించడంలో సాయపడతాయి.

## మీ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచే.. ఆహారాలు ఇవే..!



జీర్ణ సమస్యలు సాధారణంగా.. అనారోగ్యకరమైన ఆహారం, నిశ్చల జీవనశైలి కారణంగా ఎదురవుతూ ఉంటాయి. మనం తీసుకునే ఆహారాన్ని జీర్ణం చేయడంతోపాటు.. శరీరానికి అవసరమైన పోషకాలను శోషించుకొని వ్యర్థాలను బయటకు నెట్టేయడంలో జీర్ణవ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. జీర్ణవ్యవస్థ సరిగ్గా పని చేయకపోతే.. మలబద్ధకం, యాసిడ్ రిఫ్లక్స్, ఎసిడిటీ, గ్యాస్, అజీర్ణం, త్రేనుపు, గుండెల్లో మంట, ఇరిటేటబుల్ బౌల్ సిండ్రోమ్ వంటి సమస్యలు ఎదురవుతాయి. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో, పనితీరును మెరుగుపరచడంలో కొన్ని ఆహార పదార్థాలు సహాయపడతాయి. మీ జీర్ణ వ్యవస్థను రక్షంచే ఆహారాలు ఏమిటో తెలుసుకోవాలంటే.. ఈ స్టోరీ చదివేయండి.

పెరుగు..

మీ జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని పెంపొందించే మరో అద్భుతమైన ఆహారం పెరుగు. పెరుగులోని ప్రోబయోటిక్స్ గట్ మైక్రోబయోమ్ సమతుల్యతను మెరుగుపరుస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మనం తీసుకున్న ఆహారం సులభంగా జీర్ణమై, కడుపుబ్బరం వంటి సమస్యలను దూరం చేసే మంచి బ్యాక్టీరియాను ఉత్పత్తి చేయడంలో పెరుగు సమర్థంగా పనిచేస్తుంది. దీన్ని ఆహారంలో భాగం చేసుకుంటే.. జీర్ణక్రియ సాఫీగా జరిగి, తేన్పులతో పాటు ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు దూరం అవుతాయి.

అల్లం..

వికారం, ఉబ్బరం, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలకు చికిత్స చేయడానికి అల్లాన్ని ఎన్నో శతాబ్దాలుగా వాడుతున్నారు. అల్లంలో జింజెరోల్స్, షోగోల్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థలో మంటను తగ్గిస్తుయి. జీర్ణక్రియను ప్రోత్సహించడలో సహాయపడతాయి. అల్లం జీర్ణవ్యవస్థలోని కండరాలను సడలించడంలో సహాయపడుతుంది. ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలను నివారిస్తుంది. రోజుకు రెండు లేదా మూడు సార్లు చిన్న అల్లం ముక్కను తీసుకోవడం వల్ల తేన్పుల సమస్య నుంచి ఉపశమనం పొందచ్చు.

ఓట్స్..

ఓట్స్‌లో కరిగే ఫైబర్ మెండుగా ఉంటుంది. ఇది పేగు కదలికలను నియంత్రించడంలో, మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. కరిగే ఫైబర్ ఫైబర్ పేగులో జెల్ లాంటి పదార్థాన్ని ఏర్పరుస్తుంది, ఇది జీర్ణవ్యవస్థ ద్వారా ఆహార మార్గాన్ని నెమ్మదిస్తుంది. దీంతో.. శరీరం పోషకాలను మరింత సమర్థవంతంగా గ్రహించుకోగలదు.

బొప్పాయి..

బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. పాపైన్ ప్రొటీయోలైటిక్ ఎంజైమ్, అంటే ఇది జీర్ణవ్యవస్థలో ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది గ్యాస్, ఉబ్బరం, గ్యాస్ వంటి జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. బొప్పాయిలో ఫైబర్ ఉంటుంది, ఇది ప్రేగు కదలికలను నియంత్రిస్తుంది. మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

పుదీనా..

పుదీనా.. ఉబ్బరం, అజీర్ణం, వికారం వంటి జీర్ణ సమస్యలకు చికిత్స చేయడానికి ఔషధంలా పనిచేస్తుంది. పుదీనాలో.. జీర్ణాశయ కండరాలను సడలించడానికి సహాయపడే సమ్మేళనాలు ఉంటాయి. ఇది ఉబ్బరాన్ని నివారించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో తోడ్పడుతుంది. పుదీనా జీర్ణవ్యవస్థలో మంటను తగ్గిస్తుంది, ఇరిటేటబుల్ బౌల్ సిండ్రోమ్ సమస్యను పరిష్కరిస్తుంది.

## తీపి పదార్థాలు తినాలన్న కోరిక పెరిగిపోతోందా? అయితే జాగ్రత్త ఈజీ..రుచేసుకోవచ్చు

తీపి పదార్థాలను తినాలన్న కోరిక అందరికీ ఉంటుంది. కాస్త తీపి తిన్నాక ఆ కోరిక తగ్గిపోతుంది. కానీ కొందరికి రోజురోజుకి తీపిగా ఉండే పదార్థాలను తినాలన్న కోరిక ఎక్కువైపోతూ ఉంటుంది. అలా తీపి ఆహారాల కోరిక పెరుగుతుందంటే అంటే భవిష్యత్తులో కొన్ని రకాల మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉందని చెప్పే ఒక హెచ్చరికగా భావించాలి. అల్జీమర్స్ వ్యాధి... జ్ఞాపకశక్తి, ఆలోచన , సామాజిక సామర్థ్యాలను ప్రభావితం చేస్తుంది. తీపి ఆహారం తినాలన్న కోరిక అధికంగా ఉన్నవారికి సమీప భవిష్యత్తులో ఈ అల్జీమర్స్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు అధ్యయనకర్తలు. దీన్నే డిమెన్షియా అని కూడా అంటారు. డిమెన్షియా అంటే చిత్త వైకల్యం అని కూడా చెప్పుకోవచ్చు. ఇది మెదడులోని వ్యక్తిత్వం, ప్రవర్తన, మాట తీరు గురించి పని చేసే భాగాలపై ప్రభావం చూపిస్తుంది. ఇది మెదడులో ఫ్రంట్ టెంపోరల్ లోబ్స్‌లో ఉన్న న్యూరాన్లకు నష్టం కలిగేలా చేస్తుంది. నిజానికి ఈ సమస్య 40 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల మధ్య ఉన్న వ్యక్తులకు వస్తుంది. ఇలాంటివారు తీపి పదార్థాలు తినాలన్న కోరిక పెరుగుతుంటే, తినకుండా తమను తాము నియంత్రణలో ఉంచుకోవడం చాలా ముఖ్యం.



ఏమిటీ లింక్?

అమెరికా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ చెబుతున్న ప్రకారం ఆహారంపై ఉన్న ఆసక్తికి, డిమెన్షియా వచ్చే అవకాశానికి మధ్య బంధం ఉంది. ప్రవర్తనలో మార్పులు, తీపి పదార్థాలను అధికంగా కోరుకోవడం వంటి వన్నీ కూడా డిమెన్షియా రాకకు సంకేతాలుగా చెబుతున్నారు. అతిగా తినడం, అతిగా మద్యం సేవించడం, తినేటప్పుడు మర్యాదలు పాటించకపోవడం వంటివి కూడా భవిష్యత్తులో డిమెన్షియా వచ్చే రాకను సూచిస్తున్నట్టే. ఇవే కాదు ఇంకా అనేక లక్షణాలు ఉన్నాయి. తదేకంగా చూడడం, వ్యక్తులతో అధికంగా మాట్లాడడం, చేసే పనిపై దృష్టి పెట్టలేకపోవడం, చేసిన పనే పదేపదే చేయడం వంటివి కూడా భవిష్యత్తులో ఈ వ్యాధి రాకకు సూచనలే.

చికిత్సజి

ఈ వ్యాధికి చికిత్స లేదు. అయితే లక్షణాలను మాత్రం మందుల ద్వారా తగ్గించవచ్చు. వైద్యులు ఈ వ్యాధి బారిన పడిన వారికి యాంటీ డిప్రెసెంట్స్ ఇస్తుంటారు. ఇది అతిగా తినడం, విచిత్ర ప్రవర్తనలను తగ్గించడానికి సహాయపడతాయి. అలాగే ఫిజియోథెరపీని కూడా సూచిస్తారు. స్పీచ్ థెరపీ ద్వారా కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచడానికి ప్రయత్నిస్తారు. ఏది ఏమైనా అతి స్వీట్లు తినడం మాత్రం ఆరోగ్యానికి అనర్ధదాయకం

## ఈ డ్రింక్స్ ఉదయం పూట తాగితే.. అందమైన మెరిసే చర్మం మీ సొంతం..!



ప్రకాశవంతంగా మెరిసే ముఖం కావాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ముఖ్యంగా అమ్మాయిలకు ఈ కోరిక బలంగా ఉంటుంది. ఐతే, ప్రస్తుత లైఫ్‌స్టైల్, కాలుష్యం, ఒత్తిడి, రేడియేషన్ కారణంగా.. చర్మ సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. మొటిమలు, బ్లాక్ హెడ్స్, టాన్, వైట్ హెడ్స్ వంటి సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, అందమైన ముఖం సొంతం చేసుకోవడానికి ఏవేవో క్రీమ్‌లు వాడతారు, ట్రీట్మెంట్స్ తీసుకుంటూ ఉంటారు. కొంతమంది న్యాచురల్ ప్యాక్స్‌తో ఈ సమస్యలకు చెక్ పెట్టాలనుకుంటారు. అయితే, చర్మానికి బయట నుంచి క్లీన్ చేయడం, పోషకణ అందించడం ఎంత ముఖ్యమో.. లోపలి నుంచీ అంతే కేర్ తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. మిలమిల మెరిసే చర్మం కావాలంటే.. దాన్ని డిటాక్స్ చేయడం చాలా ముఖ్యం. మీ చర్మం మెరుస్తూ ఉండేందుకు ప్రతి రోజూ ఉదయం తాగాల్సిన కొన్ని డిటాక్స్ డ్రింక్స్ చూసేయండి.

పసుపు టీ..

పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ వంటి వివిధ ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది మన చర్మంపై మొటిమలను తొలగించడానికి, గాయాలను నయం చేయడానికి సహాయపడుతుంది. పసుపు చర్మం మంట, చికాకు వంటి సమస్యలను పరిష్కరిస్తుంది. పసుపు టీ తాగడానికి ఒక గ్లాస్ నీళ్లలో అర స్పూన్ పసుపు వేసి 5 నిమిషాల పాటు మరిగించండి. ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి... కొంచెం నిమ్మరసం, తేనె కలిపి గోరువెచ్చగా తాగలి. ఇలా రోజూ ఉదయం తాగితే.. స్పాట్ లెస్ బ్యూటీ మీ సొంతం.

విటమిన్ సి డ్రింక్స్..

విటమిన్ సి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. విటమిన్ సి శరీరంలోని కెమికల్ టాక్సిన్స్ నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. విటమిన్ సిలో యాంటీ ఏజింగ్ గుణాలు ఉంటాయి. ఇది ఫ్రీరాడికల్స్ నుంచి చర్మ కణాలను రక్షిస్తుంది. వృద్ధాప్య ఛాయలను నివారిస్తుంది. విటమిన్ సి డ్రింక్ తయారు చేయడానికి.. రాత్రి పూట మీకు కావలిసినంత నీటిలో నిమ్మ, పైనాపిల్ , కివీ, ఆరెంజ్ సహా మీకు నచ్చిన సిట్రస్ పండ్లు వేసుకోవచ్చు. ఈ నీటిని ఉదయం పూట తాగండి. ఇది శరీరాన్ని, చర్మాన్ని శుభ్రపరిచే బెస్ట్ డిటాక్స్ డ్రింక్ అని చెప్పొచ్చు.

గ్రీన్ జ్యూస్..

ఆకుపచ్చని కూరగాయలు, పండ్లలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్స్ మెండుగా ఉంటాయి. ఇవి చర్మం నుంచి మలినాలను, వ్యర్థాలను తొలిగించి.. చర్మాన్ని డిటాక్స్ చేస్తాయి. దీంతో చర్మం తాజాగా, ప్రకాశవంతంగా మారుతుంది.

ఎలా తయారు చేసుకోవాలి..

పాలకూర, గ్రీన్ యాపిల్, కీరా, చిన్న అల్లం ముక్కను.. మిక్సీ జార్ వేసి కొన్ని నీళ్లు పోసి జ్యూస్‌లా చేయాలి. దీనికి టేస్ట్ కోసం కొంచెం నిమ్మరసం యాడ్ చేసుకోవాలి. ప్రతి రోజూ ఉదయం ఈ జ్యూస్ తాగితే.. చర్మమే కాకుండా శరీరం మొత్తం డిటాక్స్ అవుతుంది.

దానిమ్మ జ్యూస్..

దానిమ్మలోని యాంటీఆక్సిడెంట్లు చర్మంలోని మలినాలను తొలగిస్తాయి. చర్మానికి తాజాదనం, మెరుపును అందిస్తాయి. దానిమ్మలోని లైకోపీన్ మంచి రంగును ఇస్తాయి. వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా నివారిస్తుంది. మిమ్మల్ని యవ్వనంగా ఉంచుతుంది. ఉదయం పూట దానిమ్మ జ్యూస్ తాగితే.. మీ చర్మంలోని మలినాలు తొలగి ఫ్రెష్‌గా ఉంటుంది.

పుచ్చకాయ, తులసి జ్యూస్..

పుచ్చకాయ, కీరా, తులసి జ్యూస్ బెస్ట్ డిటాక్స్ డ్రింక్ అని చెప్పవచ్చు. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మంలో నూనె స్రావాన్ని సమతుల్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. పుచ్చకాయలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు చర్మాన్ని యవ్వనంగా ఉంచుతాయి. కీరా, పుచ్చకాయలో.. పొటాషియం కంటెంట్ శరీరంలో అదనపు సోడియంను గ్రహించడంలో సహాయపడుతుంది. దీని వల్ల చర్మం హైడ్రేట్‌గా ఉండి.. మెరుస్తూ ఉంటుంది.

అరకప్పు పుచ్చకాయ, సగం దోసకాయ, కొద్దిగా తులసి వేసి బాగా గ్రైండ్ చేసి జ్యూస్‌ను ఫిల్టర్ చేయాలి. దీనిలో కాస్త నిమ్మరసం కలిపి.. ఉదయం పూట తాగితే చర్మం మెరుస్తుంది.

AP 4PG 10 02 2025 MONDAYqxp_Layout 1 09-02-2025 09:24 PM Page 4



# 'కాలేజ్ రోజుల్లోనే అలా పిలిచేవారు..': నేషనల్ క్రష్ ట్యాగ్‌పై రష్మిక షాకింగ్ కామెంట్స్





రష్మిక మందాన.. ఈ అమ్మడు గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. ఈ కన్నడ బ్యూటీ టాలీవుడ్ లో వరుస విషయాలను అందుకుని స్టార్ హీరోయిన్ గా ఎదిగింది. ఇక అల్లు అర్జున్– సుకుమార్ క్రేజీ కాంబోలో తెరకెక్కిన 'పుష్ప' సినిమాతో 'నేషనల్ క్రష్' గా మారింది. ఈ సినిమాతో రష్మిక వర్డల్ వైడ్ ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. తన అందం, అభినయంతో కోట్లాది మంది ఫ్యాన్స్ ను సొంతం చేసుకుంది రష్మిక. ఇటీవల బాలీవుడ్ లో అడుగుపెట్టి ఈ బ్యూటీ దుమ్మురేపుతోంది. నేషనల్ క్రష్ ట్యాగ్ గురించి తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో నటి రష్మిక మందన్న ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

నేషనల్ క్రష్ రష్మిక 'ఛావా' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా నటించింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించగా.. ఈ సినిమాను దివ్యంజలి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దినేష్ విజయన్ నిర్మిస్తున్నారు. ఈ మూవీలో శంభాజీ మహరాజ్‌గా విక్కీ కౌశల్, ఆయన సతీమణి యేసుబాయి పాత్రలో రష్మిక నటించారు. ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా, అశుతోష్ రాణా, దివ్య దత్తా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అయితే ఈ సినిమా వర్డల్ వైడ్ గా ఫిబ్రవరి 14న ఇది విడుదల కానుంది.

ఇవే కాకుండా రష్మిక చేతులో 'సికిందర్'అనే బాలీవుడ్ మూవీ కూడా ఉంది. ఈ సినిమాకు ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వం వహిస్తుండగా.. బాలీవుడ్ కండాల వీరుడు సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ త్వరలో పూర్తికాబోతుంది. షెడ్యూల్ ప్రకారం ఈసినిమా మార్చిలో విడుదల కానుంది. ఇలా భారీ బడ్జెట్, మల్టీ స్టారర్ మూవీలో రష్మికకు బాలీవుడ్ లో మరో భారీ అవకాశం లభించింది. అంతే కాకుండా.. 'కుబేర', 'సికందర్', 'థామా', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్ బో' సినిమాల్లో రష్మిక యాక్ట్ చేస్తున్నారు.

రష్మిక తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ నేషనల్ క్రష్ ట్యాగ్‌ని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వయసుతో సంబంధం లేకుండా తాను ఇప్పుడు అందరి ప్రేమాభిమనాలు సొంతం చేసుకుంటున్నానని పేర్కొంది. మూవీ లవర్స్ నుంచి ప్రేమను అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ ప్రత్యేక ఇంటర్వ్యూలో రష్మిక మందన్నా మాట్లాడుతూ.. "నేషనల్ క్రష్ టైటిల్ తన మొదటి సినిమా కిరిక్ పార్టీ (2016) తో ప్రారంభమైంది. అంతకంటే ముందు, కాలేజ్ రోజుల్లో నేను చాలా మందికి క్రష్‌ని, తరువాత అది కర్ణాటక క్రష్‌గా, చివరికి నేషనల్ క్రష్‌గా మారాను. ఈ రోజు ప్రేక్షకులందరూ నన్ను అమితంగా ఇష్టపడటం చూస్తుంటే 'నేషనల్ క్రష్' అనే దశ నుంచి ముందుకు వచ్చినట్లు ఉంది' అంటూ ఆసక్తికర కామెంట్స్ చేసింది.

ఇప్పుడు తాను ప్రేక్షకుల అందరిలో గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాననీ, నేషనల్ వైడ్ గా ఇలా గుర్తింపు పొందడం తనాకెంతో ప్రత్యేకంగా అనిపిస్తుందని పేర్కొంది. అలాగే.. ప్రేక్షకుల జీవితాల్లో భాగమైపోయాననిపిస్తుందని రష్మిక ఆనందం వ్యక్తం చేశారు. అలాగే.. యేసు బాయి పాత్ర చేయడం చాలా ప్రత్యేకమైన అనుభూతి అని, తొలుత ఈ అవకాశం వచ్చినప్పుడు ఆశ్చర్యపోయానని చెప్పారు. ఇలాంటి పాత్ర చేయడం జీవితాంతం గుర్తిండిపోతోందంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది.




# బ్లూ కలర్ డ్రెస్‌లో రకుల్ స్టన్నింగ్ లుక్..



సాధారణంగా ఆర్మీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న కుటుంబంలో అంతా ఎంత స్ట్రిక్ట్‌గా ఉంటారో తెలిసిందే. అలాంటి ఫ్యామిలీ నుంచి వచ్చి టాప్ హీరోయిన్‌గా ఎదిగారు రకుల్ ప్రీత్ సింగ్. ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అనతికాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్ అందుకున్నారు రకుల్. ప్రస్తుతం తెలుగు తెరకు దూరంగా హిందీలోనే తన అదృష్టం పరీక్షించుకుంటున్నారు. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

10 అక్టోబర్ 1990న పంజాబీ సిక్కు కుటుంబంలో న్యూఢిల్లీలో జన్మించారు రకుల్ ప్రీత్ సింగ్. ఆమె తండ్రి కుల్విందర్ సింగ్ ఆయన ఆర్మీలో ఆఫీసర్.. తల్లి రాజేందర్ కౌర్. ధౌలా కౌన్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం, ఢిల్లీలోని జీసస్ అండ్ మేరి కాలేజీలో మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు రకుల్. క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడే తత్వాన్ని తన పేరెంట్స్ నుంచే నేర్చుకున్నానని రకుల్ ఎన్నో వేదికలపై తెలిపారు ఈ ముద్దుగుమ్మ. వారే తనకు ఇన్స్‌పిరేషన్ అని.. జీవితంలో అనుకున్నది సాధించడానికి తనను వెన్నుతట్టి ప్రోత్సహించారని తన తల్లిదండ్రుల గురించి గొప్పగా చెబుతుంటారు.

అందరూ నటనపై ఆసక్తితోనో, ప్యాషన్‌తోనో సినీ పరిశ్రమలో అడుగుపెడుతుంటారు. అయితే రకుల్ మాత్రం కేవలం పాకెట్ మనీ కోసం ఇండస్ట్రీలో అడుగుపెట్టారట. తొలుత కన్నడంలో గిల్లి సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన రకుల్.. తర్వాత మోడలింగ్‌లో దుమ్మురేపారు. సందీప్ కిషన్ హీరోగా నటించిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీతో తెలుగువారిని పలకరించారు . ఈ సినిమాలో ఆమెకు నేమ్ అండ్ ఫేమ్ వచ్చింది . వచ్చిన ప్రతి అవకాశాన్ని అందుకుంటూ టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందారు. చిన్నా, పెద్దా అందరికీ రకుల్ ప్రీత్ సింగే హీరోయిన్‌గా కావాలి అన్నంతగా బలమైన ముద్రవేశారు.

టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలోనూ ఛాన్స్‌లు పట్టేసింది రకుల్. తన సంపాదనను తెలివిగా పలు వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి రెండు చేతులా సంపాదిస్తున్నారు. బాలీవుడ్ నటుడు, నిర్మాత అయిన జాకీ భగ్నానితో కొన్నాళ్లు డేటింగ్ చేసిన రకుల్ ప్రీత్ సింగ్ ఆయనను పెళ్లాడారు. ప్రస్తుతం హిందీలో దే దే ప్యార్ దే 2లో నటిస్తున్నారు. అన్షుల్ శర్మ దీనికి దర్శకుడు కాగా వచ్చే ఏడాది మార్చిలో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నారు.

# ఆమె కోసం నిరాహార దీక్ష చేస్తా.. దారుణంగా అన్యాయం అంటూ నరేష్ సంచలన వ్యాఖ్యలు



సినీ పరిశ్రమలో సుదీర్ఘకాలం నటుడిగా, నిర్మాతగా కొనసాగుతున్న వారిలో సర్ వీకే నరేష్ ఒకరు. ఆయన తెలుగు సినిమా పరిశ్రమలో 52 ఏళ్లు పూర్తి చేసుకొన్నారు. అంతేకాకుండా జనవరి 20వ తేదీ ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా తన తన జీవిత భాగస్వామి పవిత్రా లోకేష్‌తో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తన తల్లి విజయ నిర్మల గారికి, తెలుగు ప్రముఖులకు జరుగుతున్న అన్యాయం గురించి గళమెత్తారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ..

మా అమ్మ విజయనిర్మల అని కాదు. ఇండస్ట్రీలో చాలా మంది గొప్ప వాళ్లకు పద్మ అవార్డులు రాలేదు. పద్మ అవార్డుకు అర్హులైన వారిలో వరల్డ్‌లో మోస్ట్ డిజైరబుల్ పర్సన్ మా అమ్మ అని గొప్పగా చెప్పుకొంటాను. ఎందుకంటే ఆమె ఓ మహిళ డైరెక్టర్‌గా 46 సినిమాలకు దర్శకత్వం వహించారు. అయినా ఆమెకు పద్మ పురస్కారం రాకపోవడం చాలా బాధాకరం. కొంత బాధతో ఆగ్రహంతో చెబుతున్నాను. నా తల్లి బతికి ఉన్న సమయంలో ఆమెకు ఇష్టం లేకపోయినా ఢిల్లీ వరకు క్యాంపెయిన్ చేశాను. కానీ ఫలితం లేకపోయింది అని వీకే నరేష్ అన్నారు.

ఒక తెలుగు మహిళగా పద్మ అవార్డుకు అర్హత ఉందని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా స్వ–యంగా రికమండేషన్ పంపించారు. కాబోతే అక్కడికి వెళ్లినప్పుడు.. కొన్ని అదృశ్య శక్తులు మాకు వ్యతిరేకంగా పనిచేశాయి. వారి గురించి, ఆ వివాదాస్పద అంశాల గురించి నేను మాట్లాడను. బీజేపీ వచ్చిన తర్వాత పద్మ అవార్డులను అర్హత ఇవ్వడంలో ఖచ్చితంగా మార్పు కనిపిస్తున్నది. ఈ పరిస్థితుల్లో మరోసారి మా అమ్మకు పద్మ అవార్డు కోసం సిఫారసు చేస్తాను అని ఆయన తెలిపారు.

తెలుగు వారికి పద్మ అవార్డుల్లో అన్యాయం జరుగుతున్నది నిజమే. ఢిల్లీ లెవెల్స్ అవార్డులను ప్రభావితం చేసే వ్యక్తులు చాలా మంది ఉన్నారు. అంతేందుకు ఎన్టీఆర్‌కు భారత రత్న రాలేదు. తెలుగు వారికి గుర్తింపు తెచ్చిన వ్యక్తికే గుర్తింపు లేదు. తెలుగు వారెందరికో ఈ అవార్డులు రాలేదు. ఎన్టీఆర్, విజయ నిర్మల లాంటి గొప్ప వాళ్లకు అవార్డులు రావాల్సిన అవ–సరం ఉంది. నేను ఇక నుంచి క్యాంపెయిన్ చేస్తాను అని నరేష్ అన్నారు.

# తండేల్ మూవీ రివ్యూ అండ్ రేటింగ్

జాలరి కుటుంబాలకు చెందిన రాజు (నాగచైతన్య), సత్య (సాయిపల్లవి) చిన్నతనం నుంచి ప్రేమించుకొంటారు. ప్రతీ ఏటా కొన్ని నెలలు పాటు వేటకు రాజు తన గ్రామస్థులతో కలిసి వెళ్తుంటారు. అలా కొన్ని నెలలపాటు రాజు కోసం ఎదురు చూస్తూ ఆయన ప్రేమకై పరితపిస్తుంటుంది. ఈ క్రమంలో భారీ తుఫాన్‌లో చిక్కుకొన్న రాజు బృందం భారతీయ సముద్ర జలాల సరిహద్దు దాటి పాకిస్థాన్‌లోకి ప్రవేశిస్తారు. ఇక ఇదిలా ఉండగా, తన ప్రాణం కంటే మిన్నగా ప్రేమించిన రాజును కాదనుకొని వేరే వ్యక్తితో సత్య పెళ్లికి సిద్దపడుతుంది.

రాజు, సత్య మధ్య ప్రేమ వ్యవహారం ఎలా సాగింది? సత్యకు ఇచ్చిన మాటను రాజు ఎందుకు తప్పాడు? సత్యకు ఏం మాట ఇచ్చాడు? ఎందుకు మాటను తప్పాల్సి వచ్చింది? మాట తప్పిన రాజుకు శిక్ష విధించేందుకు సత్య ఎలాంటి నిర్ణయం తీసుకొన్నది? పాకిస్థాన్ పోలీసులకు పట్టుబడిన రాజు బృందానికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? తండేల్ అంటే లీడర్‌గా తనతో పాటు వచ్చిన 22 మంది జాలర్ల కోసం ఎలాంటి తెగింపుకు పాల్పడ్డాడు. పాకిస్థాన్ జైలు నుంచి విడుదలకు అనుమతి లభించినా రాజు బృందం ఎందుకు బయటకు రాలేకపోయింది? వేరే వ్యక్తితో సత్య పెళ్లికి సిద్ధపడిన విషయం తెలిసిన రాజు రియాక్షన్ ఏమిటి? చివరకు పాక్ జైలు నుంచి ఎలాంటి కండీషన్ల మధ్య రాజు బృందం విడుదలైంది? సత్య, రాజు ప్రేమ కథకు ముగింపు ఏమిటనేది ఈ సినిమా కథ.

ఉత్తరాంధ్రలో జరిగిన యదార్థ సంఘటనను ఆధారంగా చేసుకొని దర్శకుడు చందూ మొండేటి ఎంచుకొన్న పాయింట్ బాగుంది. స్టోరీ పాయింట్ చుట్టు రాసుకొన్న లవ్ ట్రాక్ సినిమాకు ప్రాణంలా నిలిచేలా చేశాడు. కానీ కథ చెప్పడంలోను సాగదీసి సాగదీసి విసిగించేలా కొన్ని సీన్లు పెట్టుకోవడం పంటి కింద రాయిలా అనిపిస్తుంది. ఇక సాయిపల్లవి, నాగచైతన్యను బాగా నమ్ముకొని.. మిగితా క్యారెక్టర్లకు బీ గ్రేడ్ యాక్టర్లను ఎంచుకోవడం వల్ల సినిమాకు రావాల్సిన ఫీల్, స్టేటస్ మిస్ అయిందనే ఫీలింగ్ కలుగుతుంది. సాయిపల్లవికి పెళ్లి చేసుకోవాలనుకొన్న వ్యక్తిని నాసిరకమైన యాక్టర్ పెట్టడం వల్ల మూవీకి కనెక్టివిటీ మిస్ అయిందనిపిస్తుంది. కాకపోతే సాయి పల్లవి, చైతూ కోసం రాసుకొన్న సన్నివేశాలు ఫస్టాఫ్‌కు ప్లస్ పాయింట్‌గా మారాయి.

ఇక సెకండాఫ్ విషయానికి వస్తే.. పాకిస్థాన్ ఎపిసోడ్ విషయంలో స్క్రిప్టుపరంగా చాలా లోపాలు కనిపించాయి. సినిమాటిక్ లిబర్టీ ఎక్కువగా తీసుకోవడం వల్ల కథలో ఉండే ఇంటెన్సిటీ, జెన్యూనిటీ తేలిపోయింది. ఇక సెకండాఫ్‌లో కొన్ని సీన్లు ఎమోషన్స్‌ను బ్రేక్ చేశాయనిపిస్తుంది. ఇలాంటి లోపాలన్నింటిని సాయిపల్లవి తన ఫెర్ఫార్మెన్స్, ప్రజెన్స్‌తో సరిదిద్దిందనే చెప్పవచ్చు. ఇక కీలక సన్నివేశాల్లో ముఖ్యంగా ప్రీ క్లైమాక్స్ నుంచి వచ్చే కొన్నీ ఎపిసోడ్స్‌లో నాగచైతన్య యాక్టింగ్ హైలెట్‌గా అనిపిస్తుంది. కొన్ని సీన్లు సాగదీసినట్టు, మరికొన్ని సీన్లు ఎమోషనల్ ఉండటంతో మిక్స్‌డ్ ఫీలింగ్స్‌తో ఎట్టకేలకు సినిమా ముగిసిందనే ఫీలింగ్ కలుగడం సహజంగానే అనిపిస్తుంది.

తండేల్ సినిమాను ఆద్యంతం సాయిపల్లవి మెట్టు ఎక్కించే ప్రయత్నం చేసింది. కథాపరంగా ఉన్న కొన్ని లోపాలను కూడా తన పెర్ఫార్మెన్స్‌తో కనిపించకుండా చేసేలా నటించింది. సత్య పాత్రలో జీవించింది. చాలా సన్నివేశాల్లో ఉద్వేగభరితమైన నటనతో ప్రేక్షకుడిని కంటతడి పెట్టించేలా చేస్తుంది. నాగచైతన్య విషయానికి వస్తే.. తన కెరీర్‌లో బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. రాజు పాత్రను ఓన్ చేసుకొని నటించిన విధానం బాగుంది. యాక్షన్, ఎమోషన్స్, లవ్ ట్రాక్‌లో చైతూ, సాయిపల్లవి జోడి ఇరగదీసిందనే చెప్పొచ్చు. మిగితా పాత్రల్లో దివ్య పిళ్లై, బబ్లూ పృథ్వీరాజ్, తమిళ నటులు కరుణాకరన్, ఆడుక్కాలమ్ నరేన్, పాకిస్థాన్ జైలర్ పాత్రలో ప్రకాశ్ బేలవాడి, మహేష్ ఆచంట తన పాత్రలకు తగినట్టుగా నటించారు.




సాంకేతిక విభాగాల పనితీరు విషయానికి వస్తే.. ఈ సినిమాకు సినిమాటోగ్రఫి, మ్యూజిక్, ఆర్ట్ వర్క్ స్పెషల్ ఎట్రాక్షన్. చాలా చోట్ల పేలవమైన సన్నివేశాలకు దేవీ శ్రీ ప్రసాద్ తన బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో బాగా ఎలివేట్ చేయడంలో సక్సెస్ అయ్యాడు. పాటలు సినిమాకు నెక్ట్స్ లెవెల్ అనే విధంగా ఉన్నాయి. పోర్టు సీన్లు, సముద్ర మీద సన్నివేశాలు, పాకిస్థాన్, వాఘా బోర్డర్ సీన్లను సినిమాటోగ్రాఫర్ శ్యామ్ దత్ బాగా చిత్రీకరించాడు. నాగేంద్ర ఆర్ట్ వర్క్ బాగుంది. బన్నీ వాసు అనుసరించిన నిర్మాణ విలువలు క్లాస్‌గా ఉన్నాయి.

జాలర్ల కుటుంబాల్లో ఉండే వెతలు, సాధకబాధకాల బ్యాక్ డ్రాప్‌తో ఎమోషనల్ లవ్ స్టోరి, దేశభక్తి అంశాలను కలిపి రూపొందించిన చిత్రం తండేల్. నటీనటుల పెర్ఫార్మెన్స్ ఈ సినిమాను నిలబెట్టాయని చెప్పాలి. సాయిపల్లవి పెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు బ్యాక్ బోన్ కాగా.. నాగచైతన్య యాక్టింగ్ సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్. టెక్నికల్ అంశాలు సినిమాలో డామినేట్ చేసే అంశాలుగా కనిపిస్తాయి. కథ, కథనాల పరంగా చందూ మొండేటి ఇంకా బాగా వర్క్ చేసి ఉండాల్సిందనిపిస్తుంది. లాజిక్స్, స్క్రిప్టుపరంగా లోపాలను వెతక్కుండా సినిమా చూస్తే.. సినిమా తెగ నచ్చేస్తుంది. లవ్ సీన్లు, యాక్షన్ ఎపిసోడ్స్ కొత్త అనుభూతిని పంచుతాయి. ఈ సినిమా పక్కాగా థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్ సినిమా. సాయిపల్లవి, చైతూ యాక్టింగ్ కోసం ఈ సినిమాను చూడండి.. డోంట్ మిస్.

PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com